# వృద్ధపరివర్తనం

వేముల రమణమూర్తి

"దాహం!.... దాహంగా వుంది. అన్నయ్యా కాస్త మంచి నీళ్ళు కావాలి. అన్నయ్యా...." లేనట్టున్నాడు. ఎక్కడికో వెళ్ళుంటాడు. పాపం. నా గురించి ఎంత శ్రమ పడుతున్నాడో. వాడే లేకపోతే, నా గతే మయ్యేది. ఈ జబ్బుతో ఏనాడో చచ్చి పోవలిసింది. వాడుండ బట్టి నన్నీ హాస్పిటల్లో జాయిన్ చేసాడు. వాడికి నేనెంత ఋణపడి వున్నానో!

పెళ్ళినాడు "నాతి చరామి" అంటూ నా చేతిని పట్టుకున్న భర్తకు యిప్పుడు నేనే స్థితిలో వున్నానో కూడా తెలియదు. నేనేమై పోతేనేం అన్నట్టు వూరు కున్నాడు.

నా కొడుకులు అయోగ్యులై నాకే విధమైనా సహాయం చేయలేదు. చిన్నప్పటి నుండి కనీ పెంచి పెద్ద చేసిన వాళ్ళకి కనీసం తల్లి నన్న అభిమానం కూడా లేదు.

ఎవరో తలుపు తీసిన చప్పుడు వినిపించి అటు చూసాను. అన్నయ్య వచ్చి, నా భర్త సాయంకాలం హాస్పిటల్‌కు వస్తున్నట్టు చెప్పాడు.

హుం! చావు బతుకుల్లో వున్న నన్ను యింకా ఏం సాధిద్దామని వస్తున్నాడో. పెళ్ళంటే నూరేళ్ళ పంట అంటారు. అందరి విషయంలో అది నిజం కాదేమో. కొందరికి వరమైతే మరి కొందరికి శాపమై కూర్చుంటుంది.

జీవిత మంతా అతని సాంగత్యంలో నరకాన్ని చవి చూసాను. అతని సాహచర్యంలో గుర్తించుకో దగ్గ ఒక్క మధుర స్మృతి కూడా లేదు. జీవిత మంతా వేధించుకు తిన్నాడు.

ఈ చరమ దశలో అన్నయ్య ఆప్యాయతలో లభిస్తున్న కాస్తంత శాంతినీ దూరం చేయడానికి వస్తున్నాడేమో అనిపించింది.

నిద్రరాని కన్నుల్ని బరువుగా మూసుకున్నా. ఆలోచనలు గతంలోకి వెళ్ళాయి.

* * * *

అవి కొత్తగా పెళ్ళయిన రోజులు. భర్తకు భార్య, భార్యకు భర్త అనురాగాన్నీ, ప్రేమనూ పంచి యిచ్చుకొనే మధురమైన రోజులు.

కానీ మొదటి రాత్రి గదిలోనే తప్ప తాగొచ్చి తనని పట్టించుకోకుండా ముసుగుతన్ని పడుకుంటే, మొట్ట మొదటి రోజే రభస ఎందుకని వూరుకున్నాను. కానీ యించుమించు రోజూ అదే వరస.

ఓ రోజు నేను మొదటి సారిగా అడిగితే, "ఏమే ఒళ్ళు కొవ్వెక్కిందా! మొగాడ్ని నా యిష్టం. యీ సంపాదన నాది. యీ యిల్లు నాది. నువ్వెవర్తి"వని సమాధానం వచ్చింది.

హతాశురాలినైన నాకు అనుకోకుండా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. భర్తంటే మొదటిసారిగా ఏహ్య భావం మొదలయింది ఆనాడే.

తండ్రి సంపాదన యింటికే చాలీ చాలని సమయంలో, అన్నయ్య రెక్కల ముక్కలు చేసుకుని సంపాదించిన కొద్దిపాటి ఆస్తితో ఘనంగా పెళ్ళి చేసాడు. చేస్తున్నది చిన్న వుద్యోగమయినా మంచివాడనే నమ్మకంతో యీ కృష్ణారావు కిచ్చి పెళ్ళి చేసాడు అన్నయ్య. కానీ "మేడి పండు చూడు....." అన్న సామెతలా అయింది యీతని ప్రవర్తన.

అంతే! మొదటి రోజు లగాయితూ రోజూ యిదే వరస. రోజూ తాగి రావటం, నన్ను నానా తిట్లు తిట్టడం ఏమాత్రమైనా ఎదురు తిరిగితే వళ్ళు హూనం అయేటట్టు కొట్టడం అలవాటయింది.

ఓ రోజు తాగిన మందు యింకా చాల లేదేమో, నన్నొచ్చి డబ్బడిగారు. లేదన్నాను. నేనేమైనా సంపాదిస్తున్నానా ఆయన కివ్వడానికి. దానికి మండిపడి పోతూ, "మీ అన్నయ్య వెధవ సంబంధం కుదిర్చాడు. యింత దిక్కుమాలిన దాన్ని నాకు కట్టబెట్టాడు. మీ అన్నయ్యనే డబ్బడిగి తీసుకురా! యివ్వక పోతే నిన్నూ ఆ వెధవనీ ఏం చేస్తానో చూడు" అంటూ నానా విదాల మా అన్నయ్యను తూలనాడటం మొదలెట్టారు.

నన్నెన్నిన్నా భరించాను. కాని దేవుడు లాటి మా అన్నయ్యను అనేసరికి వుక్రోషం వచ్చి నేనూ ఎదురు తిరిగాను. ఫలితం రభస.

నాకు మా అన్నయ్యను ఏమైనా అంటే వుక్రోషం వస్తుందని గ్రహించిన తనకి యిక చీటికి మాటికి అలానే తిట్టడం మొదలెట్టారు. ఈ విషయం మా అన్నయ్యతో చెప్పలేక, దాచుకోలేక ఎన్నో సార్లు నాలో నేనే కుమిలి పోయాను.

అలా ఒక రోజా రెండు రోజులా. యిరవై సంవత్సరాలు అయ్యాయి. నిత్యం యింటిలో రణ రంగమే. ఇచ్చిన కొద్దిపాటి డబ్బుతో గుట్టుగా యింటిని గడుపు కొస్తున్నాను. అది యివ్వని నాడు, గత్యంతరం లేక చుట్టు పక్కల యిళ్ళల్లో వంట పనీ యింటి పనీ చేసుకునేదాన్ని.

అన్నయ్య సహాయం చేయగల్గినన్నాళ్ళూ చేసాడు. కానీ ఎన్నాళ్ళు చేయగలరు ఎవరైనా. ఎవరి పిల్లలు, సంసారం వాళ్ళవి.

ఈ యాంత్రిక జీవనంలో నాకూ ముగ్గురు పిల్లలు కలిగారు. కానీ ఏం లాభం? తల్లి దండ్రుల ప్రవర్తనని బట్టి పిల్లలు. భార్యా భర్తలు ఎప్పుడూ అన్యోన్యంగా సంతోషంగా వున్న నాడే పిల్లలకి కూడా తల్లి దండ్రుల పట్ల అభిమానం, ప్రేమ వుంటాయి. నిత్యం తల్లి దండ్రుల మధ్య జరుగుతున్న వివాదాల్ని చూస్తుంటే వాళ్ళకి వివేకం ఎలా వస్తుంది?

పిల్లల ఎదుటే నన్ను "హీనంగా" తిడుతుంటే అది చూసిన పిల్లలు కూడా నన్ను చులకన చేయడం మొదలెట్టారు. భార్యాభర్తల మధ్య ఎన్ని మనస్పర్థలున్నా అవి పిల్లల ఎదుట వ్యక్తం చేయ కూడదు. వాళ్ళ దృష్టిలో ఎప్పుడూ అన్యోన్యంగా, ఆదర్శంగా వుండాలి.

కానీ అలాటి అనురాగాన్ని చవి చూడని మా దాంపత్యంలో పిల్లలు ఏ విధంగా పెరుగుతారో వేరే చెప్ప నక్కర లేదు. పెద్దవాడు పదవ తరగతి మూడోసారి ఫెయిలయి తండ్రి ఎక్కడ కొడతాడో నన్న భయంతో చెప్పా పెట్టకుండా యిల్లు విడిచి వెళ్ళి పోయాడు.

వాడు వెళ్ళి పోయాడని నేను కుమిలి కుమిలి ఏడుస్తుంటే ఒక్కడి పోషణా భారమైనా తగ్గిందిలే అని సంతోషించా రాయన. మరో రెండేళ్ళకు రెండోవాడూ అలానే చేసాడు. చివరి వాడైనా వెళ్ళిపోకుండా కంటికి రెప్పలా చూసుకు వస్తున్నాను.

వయసు పెరుగుతున్న కొద్దీ ఆయనకు దురలవాట్లు ఎక్కువయ్యాయి. నాకు శక్తి రోజు రోజుకి వుడిగి పోతుంటే భవిష్యత్తు ఎలా వుంటుందో నన్న భయం పట్టుకుంది.

ఒకనాడు, పొరుగింట్లో పనిచేస్తుండగా ఆకస్మాత్తుగా పొత్తి కడుపులో నొప్పి రావటం, అది భరించరానిదిగా మారటం జరిగింది.

పొరుగువారి సహాయంతో హాస్పిటల్‌కు వెళ్లాను. ఇది చాల సీరియస్‌గా కేసని వెంటనే పెద్ద హాస్పిటల్‌కు తీసికెళ్ళమని డాక్టర్ చెప్పాడు.

ఆ విషయం ఆయనకు చెప్పాను. అదో పెద్ద విషయమా! అన్నట్టు "చూద్దాంలే!" అని

వూరుకున్నారు రోజూ నెప్పి వస్తుండటంతో పొరుగిళ్లలో పనులు మానేసుకున్నాను

ఓ రోజు తప్ప తాగొచ్చి డబ్బు కావాలని నన్నడిగారు అనారోగ్యంతో వున్న నాకూ ఆదరణ చూపించటం పోయి నన్ను తిరిగి వేధిస్తుంటే యీయన మనిషేనా' అన్పించింది నా అనారోగ్యం రోజు రోజుకి తీవ్రమౌతోందని యీ నెప్పితో నేను చచ్చిపోతానండీ అంటూ భోరున ఏడుస్తూ ఆయనకు చెప్పాను

తప్ప తాగినవాడు పశువుతో సమానమన్నట్లు ఆయన నా మాటలను లెక్కచేయకుండా, నా మెడలోని తాళిని తెంపుకుపోయారు ఆ చర్యకు నోటమాట రాలేదు

పెళ్లినాడు బాజాభజంత్రీల మధ్య, శుభ మంత్రోచ్చారణల మధ్య, వందలమంది బంధుమిత్రుల మధ్య ఆయన నా మెడలో తాళి కడుతుంటే పులకరించిన నా మనస్సు, నాఆడజన్మకు సార్థకత లభించిందన్న నాకు యీ అమానుష చర్యకు నా దృష్టిలో వైధవ్యం సంభవించిందనుకున్నాను

ఇక ఆయనతో నా జీవితం నేటితో పరిసమాప్తి అయిందనుకుని పొరుగువారి సాయంతో మా అన్నయ్య యింటికి చేరుకున్నాను

మా అన్నయ్య నా స్థితి గమనించి ఎంతో బాధపడ్డాడు వెంటనే నన్ను పెద్ద హాస్పిటల్‌లో జాయిన్ చేసాడు డాక్టర్లు నన్ను పరీక్షచేసి అన్నయ్యతో నాకు కేన్సర్ అని చెప్పారు

అన్నయ్య నాకా విషయం చెప్పలేక తనలో దాచుకోలేక చాలా మదనపడ్డాడు కాని నాకా విషయం తెలియడానికి ఎంతో సమయం పట్టలేదు

జీవితంలో ఏం సుఖపడ్డానని యింకా బతకాలని కోరుకోవాలి నాకు కేన్సర్ అని తెలిశాక ఏమి బాధపడలేదు ఈ నరకం నుండి విముక్తి అవుతోందని తెలిసిన నాకు మనస్సు తేలికపడింది

★ ★ ★ ★

గతంలోంచి వాస్తవానికి వచ్చిన నాకు ఎదురుగా భర్త కృష్ణారావుని చూసాను భయంకరమైన గతానికి గుర్తులా అతని కళ్లు ఎర్రగా వున్నాయి తప్ప తాగొచ్చినట్లుంది వస్తూనే నా రెండు చేతులూ పట్టుకుని బోరుమని ఏడ్చాడు

ఏనాడూ చూడని యీ ఆకస్మిక చర్యకి ఆశ్చర్యం కలిగింది ఒక్కసారి

సావిత్రీ' నన్ను క్షమించు' నిన్ను జీవితాంతం ఎన్నో బాధలకు గురిచేసాను ఏదో మామూలు అనారోగ్యం అనుకుని నిర్లక్ష్యం చేసాను కానీ నీకొచ్చిన జబ్బు నిన్ను నా నుండి శాశ్వతంగా దూరం చేస్తుందని వూహించలేదు సావిత్రీ' నన్ను నమ్ము' నేను తాగుబోతునైనా నిన్ను బాధించినా నువ్వు నా నుండి దూరమవుతున్నావన్న సత్యాన్ని భరించలేకుండా వున్నాను సావిత్రీ' నన్ను మనస్ఫూర్తిగా క్షమించానని ఒక్క మాట చెప్పవూ' అంటూ ఏడుస్తూనే వున్నాడు కృష్ణారావు

రెండు రోజులకంటే ఎక్కువ కాలం బతకదని చెప్పిన డాక్టరు మాటలు పదే పదే కృష్ణారావు గుండెల్లో ప్రతిధ్వనిస్తున్నాయి

చివరి ఘడియల్లో వున్నానని నాకూ తెలుసు భర్త యిలా యీ వింత ప్రవర్తనకి ఆశ్చర్యం పొందినా మాటాడాలని అన్పించలేదు ఎందుకో

★ ★ ★ ★

రెండు రోజుల తరువాత నా పరిస్థితి మరింత దిగజారింది డాక్టర్లు, నర్సులు అంతా హడావుడిగా నా గదిలోకి వచ్చారు పరీక్ష చేసిన డాక్టర్లు యిక ఆఖరి క్షణాలని అన్నయ్యతో చెప్పారు

ఆయన నా వద్దే వున్నాడీ రెండు రోజులూ అన్ని సపర్యలూ అతడే చేసాడు అతని కళ్లు యిక వర్షించలేక ఆగిపోయినట్లు వున్నాయి నా నోటి నుండి అనురాగంతో ఒక్క మాటైనా వస్తుందని ఎదురు చూస్తున్నట్లున్నాయి అతని కళ్లు

కళ్లు తెరచి ఆయన వంక చూసాను జీవితమంతా శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా ఎన్నో బాధలకు గురిచేసిన ఆయనకు నా మనసులోని మాటలను చెప్పాలని అనిపించింది

దగ్గరగా రమ్మనమని సైగ చేశాను ఆత్రుతగా ఎదురుగా వచ్చారు

ఎందుకండీ' యీ వ్యర్థ పరివర్తనం అని గట్టిగా అరచి చెప్పాలనిపించింది గాని ఆ మాటలు నా చివరి శ్వాసతో కలిసి అనంతంలో లీనమయ్యాయి □

